చూసిన కనులదే భాగ్యమట..

- ఉత్తర ద్వారంలో వైకుంఠనాథుని దర్శనం
- వెంకన్న ఆలయాలకు పోటెత్తిన జనం
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పర్వదినం

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని నియోజక వర్గవాసులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్వామి ఉత్తర ద్వార దర్శనం కోసం వైష్ణవ ఆలయాలకు వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రసన్న వేంకటేశ్వరాలయంలో నృత్యప్రదర్శన ఇస్తున్న వేదగాయత్రి కళాకారులు



దయాల్‌నగర్ వెంకటాద్రిపై పూజలందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరుడు



వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల దీపారాధన



స్టీల్‌ప్లాంట్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి



స్టీల్‌ప్లాంట్‌లో దర్శనానికి బారులు తీరిన భక్తులు



శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో వేదగాయత్రి నృత్య కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈవో కీర్తిశ్రీనివాసరావు, ఆలయ పాలక మండలి చైర్మన్ గండ్రెడ్డి రాముునాయుడు, సభ్యులు పాల్గొన్నారు. అయితే, స్వామి దర్శనం విషయంలో భక్తుల్లో గందరగోళం నెలకొంది. ఏటా స్వామి ఉత్సవ విగ్రహం బల్లపై కొలువై ఉండగా బల్ల కింద నుంచి భక్తులు ప్రవేశించడం ఉత్తర ద్వార ప్రవేశంగా భావించేవారు. అనంతరం స్వామి వారి నిజ రూపాన్ని దర్శించుకునే వారు. కానీ, ఈ ఏడాది బల్ల కింద నుంచి భక్తులు వెళ్లే పరిస్థితి లేకుండా, ఆలయ కమిటీ తీసుకున్న నిర్ణయంతో భక్తులు నిరాశ చెందారు.

పెదగంట్యాడ: 74వ వార్డు దయాల్‌నగర్‌లోని వెంకటాద్రిపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనాలు కల్పించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ధర్మకర్తలు తిప్పల వెంకటరమణారెడ్డి, అన్నపూర్ణ ఏర్పాట్లు చేశారు.

- వినాయక నగర్ వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామినిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు.
- 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వర స్వామి వారికి పూజలు, అభిషేకాలు చేశారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 4.30 గంటల నుంచి స్వామిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు, హరి నారాయణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు.

కేవీ వరకు క్యూ

స్వామి ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. క్యూ లైన్లు కేంద్రీయ విద్యాలయం వరకు చేరడంతో, వేకువజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. అనంతరం స్వామిని గరుడ వాహనంలో గుడి చుట్టూ మూడుసార్లు ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అగనంపూడి: 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు కనులపండువగా జరిగాయి. అగనంపూడి, నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు సోమవారం తెల్లవారు జాము నుంచే ఆలయానికి చేరుకుని, ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త ఈ.కె.చారి దంపతులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తులసి మొక్కల పంపిణీ



తులసి మొక్కలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామంలో కొలువైన సాయినాథునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. బాబా దర్శనానికి వచ్చిన భక్తులకు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తులసి మొక్కలు అందజేశారు. నూతన సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకుని స్వామికి నివేదించిన 108 రకాల పిండివంటలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సాయి సేవకులు పాల్గొన్నారు.

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీజీఎం చక్రవర్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) అభిజిత్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప, కర్రి దాలినాయుడు, బొడ్డ గోవింద, ఎన్నేటి రమణ, మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, దరిగి రవి, జి. అప్పలరాజు, బి. శశిభూషణరావు, రామయ్య, కూరాడా నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం విభాగాధిపతిగా వినయ్‌కుమార్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న వినయ్‌కుమార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతిగా డాక్టర్ సి.ఎం.వినయ్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ఆయన విభాగంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌ను విభాగ ఆచార్యులు డి.వి.ఆర్.మూర్తి, సిహెచ్.రామకృష్ణ, టి.విజయలక్ష్మి, విభాగ పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

ఉత్సాహంగా కోస్టుగార్డు సిబ్బంది వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న కోస్టుగార్డు అధికారులు,సిబ్బంది

మల్కాపురం: ఫిట్ ఇండియా-యంగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కోస్టుగార్డు హెడ్‌క్వార్టర్ (మల్కాపురం) ఆధ్వర్యంలో సోమవారం వాక్‌థాన్ చేపట్టారు.మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో 250 మంది తీర గస్తీ దళ సభ్యులతో పాటు సాధారణ పౌరులు పాల్గొన్నారు. ఐక్యత,ఫిట్ ఇండియా ప్రాధాన్యత, సురక్షితమైన సంస్కృతిపై తీర ప్రాంత భద్రతపై ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

చకచకా 'నాడు-నేడు' పనులు



నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అదనపు భవనానికి శ్లాబ్ వేస్తున్న దృశ్యం



సిద్ధం చేసిన టైల్స్

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అదనపు భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. నాడు-నేడు పథకం కింద ఈ భవన నిర్మాణానికి రూ.కోటి ఆరు లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఇక్కడ తొమ్మిది అదనపు గదులు నిర్మించనున్నారు. ఈ భవనానికి సంబంధించి రెండో శ్లాబ్‌ను సోమవారం పూర్తి చేశారు. ఈ పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సుబ్బారావు, హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పాఠశాలలో అదనపు భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలలకు టైల్స్ వేసేందుకు ఇప్పటికే 1802 టైల్స్ బాక్స్‌లను తెప్పించినట్లు నాడు-నేడు పనులకు సంబంధించిన జనరల్ మేనేజర్ కె.వెంకట్ తెలిపారు. అహ్మదాబాద్‌లోని టైల్స్ తయారీ సంస్థ నుంచి నేరుగా టైల్స్ తెప్పిస్తున్నామని, ఇక్కడి నుంచే మండలంలోని పాఠశాలలకు సరఫరా చేస్తామని చెప్పారు. నాణ్యమైన టైల్స్‌ను మాత్రమే వినియోగిస్తున్నామని వివరించారు.

64వ వార్డులో పెన్షన్ల పంపిణీ



లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న శ్రీను

పెదగంట్యాడ: పెన్షన్లు తొలగిస్తున్నారనే ప్రచారాలను నమ్మవద్దని వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లను అందజేస్తున్నారని తెలిపారు. వెంకన్నపాలెం, దిబ్బపాలెం సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు సోమవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సచివాలయాల పరిధిలో 88 మందికి పింఛన్లు నిలిపివేశారని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వారందరికీ మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నెల్లి భూలోక, స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల హక్కులకు గండి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉక్కు నిర్వాసితుల హక్కులకు గండి కొడుతూ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు పావులు కదుపుతున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 690వ రోజు సోమవారం ఆగ్రోఫారెస్ట్, సేఫ్టీ, ఎస్.ఎస్.డి, ఎఫ్.ఎం.డి విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర తదితరులు మాట్లాడారు. 30 ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ సన్యాసిరావు, డిపార్ట్‌మెంట్ నాయకులు సత్యనారాయణ, ఎం.గోవింద్, రాజు, సాంబశివరావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

- ఎస్టీబీఎల్‌లో వైభవంగా నిర్వహణ
- అలరించిన 'శ్రీవారికి స్వరార్చన'



గీతాలు ఆలపిస్తున్న గోపికా పూర్ణిమ



కల్యాణాన్ని వీక్షిస్తున్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు దంపతులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీనివాసుని కల్యాణం కనులపండువగా జరిగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ సినీవరల్డ్ తిరుమల బాలాజీ మందిరం వద్ద సోమవారం సాయంత్రం వైభవంగా జరిపించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేకువజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేసి, భక్తులను దర్శనాలకు అనుమతించారు. గీతా పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు భూదేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలను కోలాటం, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా కల్యాణమండపానికి చేర్చారు. వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సతీసమేతంగా విచ్చేశారు. ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత బాలాజీ వీరభద్రరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ వైస్ చైర్మన్ జి.వి.కృష్ణయ్య, ప్రతినిధులు జి.గంగా మహేష్, సోమేష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోపికాపూర్ణిమ గీతాలు

శ్రీవారి స్వరార్చన పేరిట ప్రముఖ సినీ గాయని గోపికా పూర్ణిమ బృందం ఆలపించిన భక్తి గీతాలు శ్రోతలను అలరించాయి. శ్రీనివాసుని కల్యాణ సమయంలో అన్నమాచార్య కృతులతో పాటు పలు గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ విభాగాధిపతి

ఉక్కునగరం: జాతీయ క్వాలిటీ సర్కిల్ పోటీల్లో అవార్డు గెలుపొందిన స్టీల్‌ప్లాంట్ రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ ఉద్యోగులను అధికారులు అభినందించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ప్రో ఆధ్వర్యంలో ఔరంగాబాద్‌లో ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విభాగం ఉద్యోగులు ప్రో ఎక్సలెంట్ అవార్డు గెలుపొందారు. ఈ సందర్భంగా విభాగంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విజేతలు ఆర్. సత్యనారాయణ, ఎస్.ఎల్.ఎన్. రావు, రాంప్రసాద్, కె.వి. రాజ్‌కుమార్, ఎస్.వి.వి. ప్రసాద్‌లను విభాగాధిపతి సతీష్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో అధికారులు సుబ్రహ్మణ్యం, బి. బాలాజీ, జె.కె. శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891- 2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేయిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

11 నుంచి విజ్ఞాన్‌లో యువతరంగ్



యూత్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు

అగనంపూడి : విద్యార్థులను ఆల్ రౌండర్లగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నేషనల్ యూత్ ఫెస్టివల్ (విజ్ఞాన్ యువ తరంగ్) నిర్వహిస్తున్నామని విజ్ఞాన్ సంస్థల రెక్టార్ వి.మధుసూధనరావు, సీఈవో ఎన్.శ్రీకాంత్ చెప్పారు. ఈనెల 11, 12 తేదీల్లో విజ్ఞాన్ ఇంజినీరింగ్ (కోఎడ్), మహిళా కళాశాలలు ఫార్మాస్యూటికల్ కళాశాలల సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ ఫెస్ట్‌లో దేశ నలుమూలల నుంచి పది వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు రూ.ఐదు లక్షల బహుమతి అందివ్వనున్నట్టు చెప్పారు. అనంతరం యూత్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా, ఇంజనీరింగ్ (కోఎడ్), మహిళా కళాశాలల ప్రిన్సిపాళ్లు వై.శ్రీనివాసరావు,బి.అరుంధతి,సుధాకర్, యువ తరంగ్ కన్వీనర్ బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీ దృష్టికి 87వ వార్డులో సమస్యలు



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న 87వ వార్డు నాయకులు

గాజువాక: జీవీఎంసీ 87వ వార్డులో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. కణితి గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద రూ.12 లక్షలతో ఇక్కడ బీటీ రోడ్డును నిర్మించారని, సాంకేతిక కారణాన్ని చూపి 130 మీటర్ల మేర రోడ్డును విస్మరించారని పేర్కొన్నారు. కళింగ వీధిలో పార్కు అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలని, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు ప్రగడ వేణుబాబు, దామోదర్, దానప్పలు, బొండా గోవిందరాజు, మార్పు శేషు, ఈశ్వరరావు, బుల్లెట్ రమణ, కర్రి వెంకటేష్ తదితరులున్నారు.

చిరు వ్యాపారుల వినతి

పాత కూర్మన్నపాలెం ముస్తఫా జంక్షన్‌లోని రోడ్ మార్జిన్‌లో ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకొంటున్న తమను ఖాళీ చేయించవద్దని కోరుతూ ఆ ప్రాంత చిరు వ్యాపారులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఒక ఖాళీ స్థలానికి ఆనుకొని ఉన్న రోడ్డు మార్జిన్‌లో తాము చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొంటున్నామని, ఇప్పుడు ఆ స్థలంలో భవనాలను నిర్మించేందుకు పనులు చేపట్టడంతో తమను ఖాళీ చేయమంటున్నారని పేర్కొన్నారు. అకస్మాత్తుగా ఖాళీ చేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, అందువల్ల తమకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. అంతవరకు అదే స్థలంలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

డ్వాక్రా బజార్‌లో రికార్డు స్థాయి విక్రయాలు

- ఒక్కరోజులోనే రూ.52 లక్షల కొనుగోళ్లు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలభారత డ్వాక్రా బజార్ సరస్ 2022లో రికార్డు స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజులో రూ.52,31,044 విలువచేసే కొనుగోళ్లు జరిగాయి. గత ఆరురోజుల్లో జరిగిన నమ్మకాలు రూ.1,55,40,451కి చేరుకున్నాయి. ఆదివారం సెలవు కావడంతో నగరం నలుమూలల నుంచిపెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వస్తువులు కొనుగోలు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు డ్వాక్రా బజార్ కొనసాగుతుంది.



లిల్లీపుట్ నృత్యం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఏడో రోజు కార్యక్రమాలలో భాగంగా స్నేహాంజలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. మురిపాల గోపాల...అంటూ చిన్నారుల స్వాగత గీతంతో ప్రారంభమైన కార్యక్రమాలు వేయినామాలు....ముద్దుగారే ....,బ్రహ్మమొక్కటే తదితర శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. మేదిని, హారికల లిల్లీపుట్ నృత్యం కడుపుబ్బ నవ్విస్తూ అందరి మనసులను హత్తుకుంది. సంక్రాంతి సంబరాలు, థింసా నృత్యం ఆకట్టుకున్నాయి.

కృష్ణా కళాశాల అభివృద్ధికి విరాళం



ప్రిన్సిపాల్ విజయబాబుకు రూ.50వేల చెక్కు అందిస్తున్న అధ్యాపకురాలు డాక్టర్ పద్మ

మద్దిలపాలెం: తను పని చేస్తున్న కళాశాల అభివృద్ధికి సహాయంగా రూ.50 వేలు విరాళం అందజేసి గొప్ప ఉదారత చాటుకున్నారు ఆ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పద్మ. వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.పద్మ.. కళాశాల అభివృద్ధికి రూ.50 వేల చెక్కును సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో భాగస్వామిని కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు పి.వాణి, డాక్టర్ ఎ.ఎల్.రూపారాణి, తదితరులు పాల్గొన్నారు.